క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలసిన అనిల్



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పూసల అనిల్

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా సూచనలతో కాకినాడ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా రెండోసారి పూసల అనిల్‌ను ఇటీవల నియమించారు. ఈ మేరకు తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అనిల్ కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ తనపై ఉంచిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబుల సూచనల మేరకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సాంకేతిక విద్యకు దోహదం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్

బోట్‌క్లబ్: విద్యార్థులు కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్ అన్నారు. స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఆర్‌కేసీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.5 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థుల సాంకేతిక విద్యకు కంప్యూటర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. సీఎస్‌ఆర్ నిధులు అందించిన కంపెనీ ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ సత్యనారాయణన్ (టిక్కు), రోటరీ క్లబ్ నగర అధ్యక్షుడు పోలిశెట్టి ఈశ్వరరావు, సభ్యులు బాబీ, తడాల బాబ్జి, సీతాపతిరావు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం



మనోహర్‌ను సత్కరిస్తున్న గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ సైకాలజిస్ట్ సభ్యులు

బోట్‌క్లబ్: ప్రతి మానసిక సమస్యకూ పరిష్కారం ఉంటుందని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వి.మనోహర్ అన్నారు. స్థానిక మెహర్‌నగర్‌లోని వాధూలసంలో గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ సైకాలజిస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విశిష్ట మనోవిజ్ఞాన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉన్నవారు సైకాలజిస్ట్‌లను సంప్రదించాలన్నారు. సమస్యలతో జీవితం గడపడం వల్ల అనేక ఇబ్బందులు వస్తాయన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు మనోహర్‌ను సత్కరించారు. డాక్టర్ వి.జనార్దం పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ ప్రారంభం



పీఆర్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

నాగమల్లితోట జంక్షన్: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బదిలీల ఆన్‌లైన్ సేవల కోసం హెల్ప్‌డెస్క్ ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయుల సౌకర్యార్థం కాకినాడ హెడ్ క్వార్టర్స్‌లో అందరికీ అందుబాటులో ఉండే విధంగా పీఆర్ ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలోని ఇండోర్ టీటీ హాల్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు సంఘ అధ్యక్షుడు పెద్దిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి వాడపర్తి మాచ్రా వు, కోశాధికారి నాగు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు గుత్తుల శీను తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యాయామ ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బదిలీల ప్రక్రియ ముగిసే వరకు, ఆన్‌లైన్ సేవల కోసం పీడీ ఎం.శ్రీహరి రాజు అందుబాటులో ఉంటారని, ఇతర వివరాలకు 98853 86467 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

రీ సర్వే చేయించాలని వినతి

కాకినాడ రూరల్: స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవన స్థలం రీ సర్వే చేయించాలని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీను వాకర్స్ సంఘం సభ్యులు శుక్రవారం కోరారు. ఉద్యానవనం వాయువ్యం వైపు సరిహద్దుదారుడికి, నగరపాలక సంస్థకు మధ్య స్థల వివాదం ఉన్నందున పార్కు స్థలం కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, సభ్యులు ఐరెడ్డి వెంకటరావు, పట్నాయక్, బాపిరాజు, తదితరులు కోరారు.

ఉల్లంఘనలు కావొద్దు

- వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే
- కొత్త వాహన చట్టంతో భారీగా జరిమానాలు
- లైసెన్స్ లేకుంటే రూ. 5 వేలు
- మద్యం తాగి నడిపితే రూ. 10 వేలు



వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కాకినాడ సిటీ: ఇక రోడ్డెక్కితే నిబంధనలు పాటించాల్సిందే.. లేకుంటే భారీగా చలానాలు కట్టాల్సిందే.. హెల్మెట్ లేకపోయినా, వాహన ధ్రువపత్రాలు చూపించక పోయినా రూ. వేలల్లో జరిమానాలు సమర్పించుకోవాల్సిందే. ఇదంతా కొత్త వాహన చట్టం చెబుతోంది. గతేడాది జూన్ నుంచే ఈ చట్టం అమల్లోకి వచ్చినా అది క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రూల్స్ పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో కాకినాడ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నాలుగు నెలలుగా హెల్మెట్ వాడకం కొత్త వాహన చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా చేపడుతున్న ఈ చర్యలకు అంతా సహకరించాలని కోరుతున్నారు.

మైనర్లూ... వాహనాలు నడపొద్దు

గతంలో మైనర్లు వాహనాలు నడిపితే పెద్దగా శిక్షలేమీ ఉండేవి కావు. అయితే రోడ్డు ప్రమాదాలకు మైనర్లు వాహనం నడపడం కూడా ఒక కారణం కావడంతో అధికారులు నిబంధనలు కఠినతరం చేసి, శిక్షలు అమలు చేస్తున్నారు. కొత్త వాహన చట్టంలోని రూల్స్ ప్రకారం మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వారికి రూ. 25 వేల జరిమానా విధించడంతో పాటు మూడేళ్ల జైలు శిక్ష కూడా వేసే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి మద్యం తాగి వాహనం నడుపుతున్న 276 మందికిపైగా వాహనదారులను గుర్తించి కోర్టులో హాజరు పరిచారు. అదే విధంగా హెల్మెట్ లేని వ్యక్తులకు అవగాహన కల్పించడంతో పాటు దురుసుగా ప్రవర్తించే 150 మంది వరకు ఫైన్‌లు కట్టించారు. హెల్మెట్ లేకుండా ఇష్టానుసారంగా మోటారు సైకిళ్లను నడుపుతూ ప్రమాదానికి గురైన వ్యక్తులు దాదాపు 86 మందిపై కేసులు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మరణాలు కూడా సంభవించాయని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి.

బండిస్తే అంతే...

చాలా మంది తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలకు బైక్ ఇవ్వడాన్ని చాలా గొప్పగా భావిస్తారు. ఇకపై అది కుదరదు. సదరు బాలుడు లేదా బాలిక బైక్ నడిపి ప్రమాదానికి గురైతే వాహనం ఎవరి పేరునై రిజిష్టర్ అయి ఉందో వారిపై కేసు నమోదు చేస్తారు. ప్రమాదం చేసిన వారితో పాటు వాహనం ఇచ్చిన వారిపైనా, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అమ్మిన వ్యక్తిపైనా కేసు నమోదు చేస్తారు. అప్పట్లో అయితే వెంటనే స్టేషన్ బెయిల్ మంజూరయ్యేది. నేరం రుజువైతే రెండేళ్ల వరకూ జైలు శిక్ష ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తితో పాటు సంబంధిత వాహన యాజమానికి వెంటనే బెయిల్ వచ్చే అవకాశం లేదు. పదేళ్ల పాటు జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయని పోలీసు వర్గాలు పేర్కొంటున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పక్కాగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చీరాని డ్రైవింగ్‌తో రోడ్లపైకి రావడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలి.

– ఎన్.రమేష్, ట్రాఫిక్ సీఐ, కాకినాడ

జరిమానాలు ఇలా..

- లైసెన్సు లేకుండా వాహనం నడిపితే రూ.5 వేలు (గతంలో రూ. 500 ఉండేది)
- రెడ్‌లైన్‌ను ఉల్లంఘించి వాహనం నడిపితే రూ.500
- రాంగ్ రూట్‌లో వాహనం నడిపితే రూ.5 వేలు
- అతివేగంగా వాహనం నడిపితే రూ. వెయ్యి
- మద్యం తాగి వాహనం నడిపితే రూ. 10 వేలు (గతంలో రూ. 2 వేలు)
- ర్యాష్ డ్రైవ్ చేస్తే రూ. 5 వేలు
- హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్ట్ ధరించకుండా కారు నడిపితే రూ. వెయ్యి జరిమానా, అలాగే 3 నెలల పాటు లైసెన్స్ రద్దు.
- అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళితే రూ. 10 వేలు
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ. 2 వేలు

12వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సత్తిబాబు

కరప: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా సత్తిబాబు 12వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పిఠాపురం మండలం పాత ఇసుకపల్లి గ్రామానికి చెందిన కె.కామేశ్వరరావు దీర్ఘకాలిక వ్యాధితో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి రక్తం అవసరం కాగా కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలును సంప్రదించారు. తాతీలు వెంటనే వైఎస్సార్ సీపీ నాయకుడు సత్తిబాబుకు తెలియజేయగా, వెంటనే ఆయన స్పందించి కాకినాడలోని బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానమిచ్చారు. బాధిత కుటుంబ సభ్యులు రక్తదాతకు కృతజ్ఞతలు తెలిపారు.

కోవిడ్ పట్ల అప్రమత్తత అవసరం



కోవిడ్ గురించి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వైద్యుడు అడ్డాల సత్యనారాయణ సూచించారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా సుమారు 260 కరోనా కేసులు నమోదు కావడంతో జాగ్రత్తలు పాటించాలన్నారు. రాష్ట్రంలో వైజాగ్‌లో తొలి కేసు నమోదైనట్టు అధికారులు ప్రకటించిన నేపథ్యంలో పార్టీలు, వేడుకలు, ప్రార్థనలు వంటి సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాల్లో విధిగా మాస్కులు ధరించడంతో పాటు భౌతిక దూరం పాటించాలన్నారు. చేతులు తరచూ కడుక్కోవడంతో పాటు దగ్గు, తుమ్ములు వస్తే నోరు కప్పుకోవాలని, విదేశాల నుంచి వచ్చిన వారు కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ అవకతవకలపై విచారణ చేపట్టాలి



దేవదాయ శాఖ అవకతవకలపై విచారణ చేపట్టాలంటూ డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

కాకినాడ సిటీ: పెదపూడి మండలంలో దేవదాయ శాఖలో అవకతవకలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతి పత్రం అందించారు. అనంతరం ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరు రాజుబాబు మాట్లాడుతూ పెదపూడి మండలం దేవదాయశాఖ అధికారులు ఆయా గ్రూప్ టెంపుల్స్ పరిధిలో ఉండటం లేదని అన్నారు. ప్రధానంగా శహపురం గ్రూప్ టెంపుల్స్ ఈఓ కార్యాలయం ఎక్కడ ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అటు కాండ్రేగుల, ఇటు శహపురం గ్రామాల్లో దేవదాయ శాఖ అధికారుల ఆచూకీ ఉండడం లేదన్నారు. ఇదే పరిస్థితి మరికొన్ని గ్రూప్ దేవాలయాల్లో ఉందన్నారు. దేవాలయాల అభివృద్ధి, పొలం శిస్తుల వసూళ్లు సకాలంలో జరగటం లేదని అన్నారు. శిస్తు చెల్లించని పెత్తందారుల వద్ద నుంచి భూమిని వెనక్కి తీసుకుని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు లేక అనేక మంది వలసలు పోతున్నారని, ఈ భూములను అటువంటి వారికి ఇస్తే ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని దేవదాయ శాఖకు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఆందోళనకారులు అన్నారు. లేని పక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ జిల్లా నాయకులు మడికి సత్యం, ఏల్లే సత్తిబాబు, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) నాయకులు రెడ్డి దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించండి



పెనుగుదురులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు

కరప: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. పెనుగుదురులో శుక్రవారం ఆయన గ్రామ కార్యదర్శి బి.చంద్రకళ, పంచాయతీ సిబ్బందితో కలసి పర్యటించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. రోజూ పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించి, వీధులను శుభ్రంగా ఉంచాలని, డ్రైన్లలో పూడిక తీయించాలని, దోమల నివారణకు ఎబేట్ మందును పిచికారీ చేయించాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను విడివిడిగా ఇవ్వాలన్నారు. తడి చెత్త నుంచి వర్మికంపోస్ట్ తయారు చేస్తారన్నారు. తక్కువ ధరకు లభించే ఈ ఎరువుతో ఇంటి పెరటి మొక్కలు, పూల మొక్కలను పెంచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, శుభ్రం చేయించాలని డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచనలిచ్చారు. తర్వాత ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్ర నిర్వహణను పరిశీలించారు.

రేపు క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్: పల్నాడు జిల్లా నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో వచ్చే నెల 1న స్విమ్మింగ్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయని జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ సెక్రటరీ ఇరుసుమళ్ల రాజు తెలిపారు. ఈ చాంపియన్ షిప్‌లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లను ఈ నెల 25న సామర్లకోట దుర్గాప్రసాద్ స్కూల్‌లోని ఈతకొలనులో ఆ రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఎంపిక చేస్తామన్నారు. దీనికి 15 ఏళ్లు నిండిన బాల బాలికలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 92466 90466 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ఎన్నికల అధికారులతో కలసి సమావేశం నిర్వహించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఈ సమావేశం జరిగింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలు, ఆయా కేంద్రాల వారీగా ఎలక్టోరల్ సంఖ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు, సలహాలు, బూత్‌స్థాయి అధికారులు, ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీతో పాటు అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని అన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారి ఎం.జగన్నాథం, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్.అప్పారావు, ఆర్.వెంకటేశ్వరరావు, కె.కృష్ణమోహన్, పి.రవికిరణ్, డి.శేషుబాబ్జీ, ఎ.సత్యనారాయణ, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులూ బడిబాట పట్టేలా..

- సమగ్రశిక్ష అధికారుల సర్వే
- పాఠశాలల్లోనే శిక్షణ, బోధన



పట్టణంలో సర్వే చేస్తున్న సమగ్రశిక్ష అధికారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రత్యేక అవసరాల గల పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల తీసుకు రావాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల ద్వారా సమగ్రశిక్ష ఎంతగానో కృషి చేస్తుంది. ఈ పిల్లలను ప్రత్యేకంగా విభజించారనే భావన కలగకుండా అందరితో సమానంగా విద్య అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు ప్రాథమిక పాఠశాలల సమీప భవిత కేంద్రాలను వాటితో అనుసంధానించారు. సాధారణ పిల్లలతో కలసి వీరు విద్యాబుద్ధులు నేర్చుకోవడం ద్వారా వారిలో ఆలోచనలు వృద్ధి చెందుతాయనే భావనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు చెబుతున్నారు. మాటలు రాని, మానసికంగా ఎదుగుదల లేని, నడవలేని పిల్లలు ఇళ్లలో ఉండి కుంగిపోకుండా వారికి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందించారు. చిన్నారుల వైకల్యాలు గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్యను బోధించారు. ఈ తరహా విద్య, శిక్షణలో వృద్ధి చెందిన వారిని ఆపై సాధారణ పాఠశాలల్లో చేర్పించారు. ప్రస్తుతం పిల్లలు వేర్వేరు కాకుండా వారిలో అందరూ సమానమనే భావనను పెంపొందించేందుకు సాధారణ విద్యార్థులతోనే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చదువు చెప్పించేలా చర్యలు తీసుకున్నారు. దీని కోసం మండలానికి ఒక పాఠశాల ఎంపిక చేసి భవిత కేంద్రాల బాలలను ఆయా పాఠశాలల్లో విలీనం చేశారు. అక్కడ ఐఈఆర్‌టీలతో పిల్లలకు విద్య బోధిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం, విద్యా కానుక కిట్లు, విద్యాదీవెన వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఫిజియోథెరపిస్టులు, వ్యాయామం, స్పీచ్‌థెరపీ, యోగా తదితర శిక్షణ ఇస్తారు. దీనికోసం కాకినాడ పట్టణం, రూరల్‌లో ఎంత మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నారనే అంశంపై సర్వశిక్ష అధికారులు సర్వే చేస్తున్నారు. ఇప్పటివరకు నగరం, రూరల్‌లో 46మంది దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు గుర్తించారు.

బహుళ ప్రయోజనాలు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు చేరితే ప్రతి నెలా రూ.300 రవాణాభత్యం చెల్లిస్తారు. వినికిడి, దృష్టిలోపం ఉన్నవారికి ట్యాబ్‌లతో పాటు 9, 10వ తరగతి విద్యార్థులకు ఏడాదికి జాతీయ ఉపకార వేతనం రూ.9 వేల నుంచి రూ.11 వేలు అందజేస్తారు. వైకల్య శాతం అధికంగా ఉంటే సదరం ధ్రువపత్రంతో పింఛన్ వస్తుంది. బస్సు, రైళ్లలో ప్రయాణ పాస్ సౌకర్యంతో పాటు పాఠశాలకు రాలేని వారి ఇంటికి వచ్చి బోధనతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలలకు వచ్చినట్లే హాజరు నమోదు అవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగులు బడిబాట పట్టేలా సర్వే ముమ్మరం చేశాం. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్య బోధిస్తాం. వైకల్యం కలిగిన పిల్లల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సహిత విద్య తోడ్పడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలు ఉపయోగించి వారికి లైఫ్ స్కిల్స్ నేర్పించడం ద్వారా తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేలా కృషి చేస్తున్నాం.

–చామంతి నాగేశ్వరరావు, సీఎంఓ, సమగ్రశిక్ష, కాకినాడ

నిందితుడి అరెస్టు

కాకినాడ క్రైం: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ గ్రామీణ మండలం వలసపాకల గ్రామానికి చెందిన 20 ఏళ్ల రచ్చ బబ్బులు అలియాస్ నాగ సతీష్‌కుమార్ చెడు వ్యసనాలకు బానిసై ఐదు నెలల కాలంలో సర్పవరం, పిఠాపురం పరిధిలో రెండు బైక్‌లు, ఏడీబీ రోడ్‌లో ఓ దేవాలయంలో హుండీ దొంగిలించాడు. ఇతనికి అతని స్నేహితుడు వెంకట్ సహకరించాడు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న తిమ్మాపురం పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం తిమ్మాపురం వద్ద వై.జంక్షన్‌లో బబ్బుల్ని అరెస్టు చేశారు.

పంచారామ క్షేత్రంలో పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో సౌత్ ఇండియా బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ పి.మురళీమోహన్ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చి వారికి అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, ధ్వజస్తంభం, పెద్ద నంది, మూలవిరాట్, ఉప ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సీజీఎం దంపతులకు పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బళ్ల నీలకంఠం స్వామి వారి ఫోటో, ప్రసాదం ఇచ్చారు. శుక్రవారం ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయంలో పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రేన్ ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: హైడ్రా క్రేన్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ వాకలపూడికి చెందిన మాతా అప్పలరాజు (57) పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వాకలపూడిలోని అంబేడ్కర్ వీధిలో నడుచుకుంటూ వెళుతుండగా అటుగా వెళుతున్న ఓ భారీ హైడ్రా క్రేన్ అప్పలరాజును ఢీకొంది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

కల వరి పాట్లు

- వర్షాలకు తడిసిన ధాన్యం
- నీటిలో నానిపోయి కుళ్లిపోయిన పంట
- వీకే రాయపురంలో రైతుల కష్టాలు



వీకే రాయపురంలో నీటిలో మునిగి కుళ్లిన వరి పంటను చూపుతున్న రైతు

సామర్లకోట: ఆరుగాలం కష్టించి సాగు చేస్తున్న పుడమిపుత్రులు నష్టపోతూనే ఉన్నారు.. విత్తు నుంచి పంట విక్రయించే వరకూ ఏదో ఒక రూపంలో కుదేలవుతున్నారు.. ఒకవైపు ప్రకృతి కన్నెర్రజేస్తే, మరోవైపు ప్రభుత్వ సాయం అందక ఇబ్బందులు పడుతున్నారు. సామర్లకోట మండలం వీకే రాయపురం రైతులు ప్రతి పంట సమయంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఐదు రోజులు కురిసిన వర్షాలకు వీకే రాయపురం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇక్కడ ఆలస్యంగా వరి నాట్లు వేయడంతో కోతలు ఆలస్యంగా జరిగాయి. దీనికి తోడు పంట భూములు గ్రామానికి దూరంగా ఉండడంతో యంత్రాలతో కోసిన ధాన్యాన్ని పంట పొలాల్లోనే ఉంచారు. వర్షాలు రావడంతో బరకాలు కప్పారు. అయితే బరకాలు కూడా తడిచి ముద్దవ్వడంతో ధాన్యం చెమ్మగిల్లి మొలకలు వచ్చాయి. పలుచోట్ల తడిచిన ధాన్యం ఆరబెట్టే అవకాశం లేకపోవడంతో ముక్కుపోయింది. ఈ ధాన్యం ఏ విధంగా విక్రయించాలో తెలియక రైతన్నలు ఆలోచనలో పడ్డారు. మొలకలు వచ్చిన ధాన్యంపై ఉన్నతాధికారుల నుంచి ప్రకటన రావాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎప్పటికి అధికారులు వస్తారని రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

గతమెంతో ఘనం

గత ప్రభుత్వంలో రైతులకు ఏకష్టం వచ్చినా సకాలంలో సేవలు అందేవి. అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టి పనులు చేసేవారని రైతులు అంటున్నారు. కాజీవే కోతకు గురికావడం, ఏలేరు కాలువ గట్టు కోత బారిన పడడం, తూటేరు డ్రైన్ పూడికతో నిండిపోవడం వంటి సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించేవారని అన్నారు. అయితే ప్రస్తుతం ధాన్యం తడిచి మొలకలు వచ్చాయని మొరపెట్టుకున్నా పట్టించుకునే అధికారులు లేరని రైతులు వాపోతున్నారు. వీకే రాయపురంలో 50 ఎకరాలు, బోయనపూడి గ్రామానికి చెందిన సుమారు 200 ఎకరాల్లో పంట కోయాల్సి ఉండగా, నీటిలో మునిగిపోయింది.